

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, మే 21: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు మంగళవారం ప్రకటించారు. పాడేరు, అరకులోయ, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో ఈ నెల 26వ తేదీ వరకు కనిష్ఠంగా 2 ఎంఎం నుంచి 15 ఎంఎం వర్షపాతం నమోదవుతుందన్నారు. రైతులు తొలకరి వర్షాలను సద్వినియోగం చేసుకుని వేసవి దుక్కి చేసుకోవాలని, ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

» భద్రతపై కలెక్టర్, ఎస్పీ ఆరా

పాడేరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల ఈవీఎంలను భద్రపరిచిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లకు కల్పించిన సీఆర్‌పీఎఫ్ భద్రతపై ఆరా తీసి, సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ఇతరులెవ్వరూ స్ట్రాంగ్ రూమ్‌ల వైపు ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదన్నారు. అలాగే కౌంటింగ్ నిర్వహించే జూన్ నెల 4వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు కొనసాగించాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు.



పాడేరులో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా

ఓట్ల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

» అరకులోయ రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్

పాడేరు, మే 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పా ట్లు చేయాలని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. జూన్ నాలుగో తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకులోయ అసెంబ్లీ స్థానం పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపు నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కౌంటింగ్ హాలుకు ఈవీఎంల తరలింపుపై అధికారులకు అవగాహన కల్పించారు. కౌంటింగ్ హాలులో ఈవీఎంలకు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్‌లకు 3 టేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లతో పాటు కౌంటింగ్ ప్రక్రియ సైతం ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా జరగాలన్నారు. అలాగే ప్రతి టేబుల్ వద్ద సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజర్, మరొక సహాయకుడు ఉంటారన్నారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు కౌంటింగ్ ఏర్పాట్లు, కౌంటింగ్‌పై సంపూర్ణమైన అవగాహనతో ఉండాలని సూచించారు. అనంతరం ప్రతి రోజు ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలనలో భాగంగా అరకులోయ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు చెందిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి, వాటికి వేసిన సీళ్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, అరకులోయ నియోజకవర్గం పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరకులోయ ఆర్వో వి.అభిషేక్, పక్కన ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ

వేరుశనగ సాగు విస్తరణకు కార్యాచరణ

రైతులకు కె-7 బోల్డ్ రకం విత్తనం పంపిణీకి చర్యలు

» ఎకరాకి 16-18 క్వింటాళ్ల దిగుబడి

» పరిశోధన స్థానంలో కదిరి లేపాక్షిపై పరిశోధనలు

చింతపల్లి, మే 21:

ఉన్నత పర్వతశ్రేణి గిరిజన మండలాల్లో వేరుశనగ సాగు విస్తరణకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. మార్కెట్‌లో అధిక డిమాండ్ కలిగిన కె-7 బోల్డ్ విత్తనాలను రైతులకు మినీ కిట్ల రూపంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే రానున్న రోజుల్లో అత్యధిక దిగుబడినిచ్చే నూతన వంగడాన్ని కూడా అందజేయాలని పరిశోధన స్థానంలో కదిరి లేపాక్షి రకంపై పరిశోధనలు నిర్వహిస్తున్నారు.



కె-7బోల్డ్ విత్తనం



కె-7బోల్డ్ కాయలు(ఫైల్)

అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల గిరిజన మండలాల్లో 20 ఏళ్లగా అతి తక్కువ విస్తీర్ణంలో గిరిజన రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో దేశవాళీ రకాల వేరుశనగను సాగు చేస్తున్నారు. పాడేరు డివిజన్ పరిధిలో 1,980 వేల హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగు జరుగుతోంది. రైతులు సాగుచేస్తున్న వేరుశనగ ఎకరాకు కేవలం ఐదు క్వింటాళ్ల దిగుబడిని మాత్రమే రైతులు పొందుతున్నారు. దీంతో ఈ పంటను వాణిజ్యసరళిలో సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. గిరిజన ప్రాంతాల వాతావరణం, నేలలు వేరుశనగ సాగుకు అత్యంత అనుకూలమని పరిశోధన ద్వారా గుర్తించారు. దీంతో గిరిజన రైతులతో వేరుశనగను వాణిజ్య సరళిలో సాగుచేసేలా ప్రోత్సహించేందుకు నాణ్యమైన అధిక దిగుబడినిచ్చే వంగడాలను అందజేయాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఈ ఏడాది విశాఖపట్నంలో జరిగిన జోనల్ స్థాయి పరిశోధన, విస్తరణ సలహా మండలి(జెడ్ఆర్ఈఏసీ) సమావేశాల్లో అత్యధిక దిగుబడి, గింజ పెద్ద పరిమాణంలోనున్న కె-7బోల్డ్ రకం విత్తనం రైతులకు అందజేయడంతో పాటు సాగు విస్తీర్ణం పెంపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. కే-7బోల్డు రకం నూతన వంగడాలపై పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించారు. దీంతో ఈ రకం విత్తనం ఈ ఏడాది ఖరీఫ్ నాటికి మినీ కిట్ల రూపంలో పంపిణీ చేసి సాగును విస్తరింపజేసేందుకు శాస్త్రవేత్తలు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు.



ఆర్ఏఆర్ఎస్‌లో ప్రయోగాత్మక సాగు చేస్తున్న కదిరి లేపాక్షి వేరుశనగ (ఫైల్)

ఎకరానికి 16-18 క్వింటాళ్ల దిగుబడి

నూతన వేరుశనగ రకాలు కె-7బోల్డ్ ఎకరానికి 16-18 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రస్తుతం రైతులు సాగుచేస్తున్న దేశవాళీ రకాలు కనీసం ఎకరాకు ఆరు క్వింటాళ్ల ... మిగతా 8వ పేజీలో

వేరుశనగ సాగు విస్తరణకు చర్యలు



గిరిజన రైతులకు నాణ్యమైన విత్తనం అందించి వేరుశనగ సాగును విస్తరించాలని ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించాం. వేరుశనగలో కే-7బోల్డ్ విత్తనం మినీ కిట్ల రూపంలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. అలాగే పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా సాగుచేపట్టిన కదిరి లేపాక్షి రకం ఉత్తమ ఫలితాలు వచ్చాయి. వచ్చే ఏడాది ఈ రకం విత్తనాలను రైతులకు అందజేస్తాం. సాగు విధానం, నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్నాం.

- డాక్టర్ ఎం.సురేశ్ కుమార్, ఏడీఆర్, చింతపల్లి

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

» ఎస్పీ తుహిన్ సిన్హా

» పెదబయలు పోలీస్ స్టేషన్ సందర్శన

» రికార్డులు పరిశీలన



మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పెదబయలు, మే 21: ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. మంగళవారం ఆయన పెదబయలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఇటీవల నమోదైన కేసుల రికార్డులు తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రత వివరాలను సీఐ రమేశ్‌కుమార్, ఎస్ఐ మనోజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ పూర్తయ్యే వరకు పెట్రోల్ బంకులు, దుకాణాల్లో బాటిళ్ల ద్వారా పెట్రోల్ విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఇంజరి, గిన్నెలకోట, బూసిపుట్టు పంచాయతీల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించడానికి కృషి చేసిన జి.మాడుగుల సీఐ రమేశ్‌కుమార్, పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

పాడేరు, అరకులోయకు కౌంటింగ్ పరిశీలకుల నియామకం

పాడేరు, మే 21(ఆంధ్రజ్యోతి): పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులను పరిశీలకులుగా నియమిస్తూ ఎన్నికల కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడు క్యాడర్‌కు చెందిన సీనియర్(2006) ఐఏఎస్ అధికారి కె.వివేకానందన్‌ను అరకులోయ అసెంబ్లీ స్థానానికి, బిహార్ క్యాడర్‌కు చెందిన సీనియర్(2000) ఎస్‌సీఎస్ అధికారి డాక్టర్ గజేంద్రకుమార్ సింగ్‌ను పాడేరు అసెంబ్లీ నియోజకవర్గానికి కౌంటింగ్ పరిశీలకుడిగా నియమించారు.

కిర్గిస్థాన్‌లో బిక్కుబిక్కుమంటున్న భారతీయ విద్యార్థులు

- వివరాలు మెయిన్‌లో..

దారులు ఇలా.. ప్రయాణమెలా?



రాళ్లు తేలిన జయంతివలస- బొండాంకొత్తవలస రహదారి

» మండలంలో పలు రహదారులు అధ్వానం

» రాళ్లు తేలి ఉండడంతో వాహనచోదకుల అవస్థలు

అరకులోయ, మే 21:

మండలంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నా యి. రాళ్లు తేలి రాకపోకలకు వీలులేకుండా ఉన్నాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఎప్పటికి ఈ రహదారులు బాగుపడతాయోనని ఆవేదన చెందుతున్నారు.

మండలంలోని జయంతివలస- బొండాంకొత్తవలస, కాగువలస- అంటిపర్తి రహదారులు రాళ్లు తేలి దారుణంగా ఉన్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురికావడంతో పాటు ఒళ్లు హూనమవుతోందని వాపోతున్నారు. మిషన్ కనెక్ట్ పాడేరు పథకం కింద చేపట్టిన ఈ రహదారుల నిర్మాణ పనులు బిల్లులు మంజూరుకాకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ మార్గాల్లో సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉన్నా మట్టి పనులు చేపట్టి వదిలేశారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు బురదమయం అవుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు.



కాగువలస- అంటిపర్తి రహదారి ఇలా..

పకడ్బందీగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

విద్యాశాఖాధికారులకు డీఆర్‌వో పద్మావతి సూచన



విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌వో పద్మావతి

పాడేరు, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 24 నుంచి మొదలయ్యే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి సూచించారు. జిల్లాలో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలపై మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,530 మంది విద్యార్థులకు గానూ 1,118 మంది రెగ్యులర్, 412 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. జిల్లాలో 7 పరీక్షా కేంద్రాల్లో వారంతా పరీక్షలు రాస్తారని, ఆయా పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలన్నారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖాధికారులు సమన్వయంతో పని చేసి రెగ్యులర్ పరీక్షల నిర్వహణకు మించి విజయవంతం చేయాలన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి జరిగే ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలపైనా డీఆర్‌వో సమీక్షించారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్‌కు 424 మంది, ఇంటర్‌కు 321 మంది పరీక్షలు రాస్తారన్నారు. వారందరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.7

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. భీమిలి				
2. విశాఖ తూర్పు				
3. విశాఖ పశ్చిమ				
4. విశాఖ ఉత్తరం				
5. విశాఖ దక్షిణం				
6. గాజువాక				
7. పెందుర్తి				
8. అనకాపల్లి				
9. యలమంచిలి				
10. పాయకరావుపేట				
11. నర్సీపట్నం				
12. చోడవరం				
13. మాడుగుల				
14. పాడేరు				
15. అరకు				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : పోర్టు హాస్పిటల్ ఎదురుగా, ఎన్.హెచ్.16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-530016.

ఉదయం ఎండ.. సాయంత్రం భారీ వర్షం



సీలేరు వలసగెడ్డ వద్ద చెట్లపై ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

సీలేరులో భిన్న వాతావరణం

సీలేరు, మే 21: జీకేవీధి మండలం సీలేరులో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఎండ వేడికి జనం అల్లాడిపోయారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. ఉరుములు, మెరుపులతో రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు వర్షం పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో జనం ఇబ్బందులు పడ్డారు.



సీలేరులో వర్షం

వలసగెడ్డ వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభం

జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని వలసగెడ్డ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీవాన కురిసింది. దీంతో సీలేరు నుంచి వలసగెడ్డ కొత్తూరు, మునసపల్లి, వలసపల్లి వెళ్లే విద్యుత్ లైన్‌లో ఒక స్తంభం టేకు చెట్టుపై ఒరిగిపోయింది. దీని వల్ల దుప్పులవాడ పంచాయతీలోని పలు గ్రామాలతో పాటు సీలేరు పంచాయతీలోని పలు గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే ఈపీడీఎల్ సిబ్బంది, జెన్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టారు. అయితే బుధవారం పూర్తిస్థాయిలో వలసగెడ్డకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే అవకాశం ఉంది.

క్రైం... crime news

బస్సు ఢీకొని యువకుడి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వినయ్

నక్కపల్లి, మే 21: మండలంలోని ఉద్దండపురం హైవే వద్ద మంగళవారం మధ్యాహ్నం జరి గిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మండలంలోని రేబాక నుంచి అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీకి కార్మికులను తీసుకువెళుతున్న బస్సు ఉద్దండపురం హైవే జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో తుని నుంచి విశాఖ వైపు వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వస్తున్న వినయ్ (33) అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు దుర్గేశ్ (32) తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడిని తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిద్దరు విశాఖకు చెందిన వారిగా గుర్తించారు. ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతిపై కేసు నమోదు

రావికమతం, మే 21: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి కారణమైన మేడివాడ గ్రామానికి చెందిన జి.స్వామినాయుడుపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపారు. మేడివాడ శివారు అప్పలమ్మపాలెంనకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా శనివాడ సంతోష్ (21) పని చేస్తుంటాడు. అయితే, ఈనెల 14న ఇదే పంచాయతీ శివారు బాదనపాడుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిని పునరుద్ధరించే పనిని మేడివాడకు చెందిన స్వామినాయుడు (మరో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్) సంతోష్‌కు పురమాయించాడు. విద్యుత్ సరఫరా నిలిపివేస్తానని స్వామినాయుడు భరోసా ఇవ్వడంతో సంతోష్‌ను స్తంభంపైకి వెళ్లి మరమ్మతు చేస్తుండగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో ఆయన విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. సంఘటనా స్థలానికి సమీపంలో పనిచేస్తున్న తన మామ గుర్తించి తీ వ్రగాయాలైన సంతోష్‌ను సహచరుల సహాయంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ సంతోష్ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. దీనికి సంబంధించి మృతుడు తల్లి చిన్నమ్మలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తానని చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరించి సంతోష్ మరణానికి కారణమైన స్వామినాయుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందిన సంతోష్

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెచ్‌సీ దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన వెంకటపతిరాజు

తగరపువలస, మే 21: రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ దుర్మరణం చెందారు. ఈ సంఘటన తగరపువలస జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వలందపేట వద్ద మంగళవారం ఉదయం జరిగింది. ఎస్ఐ కె.హరీశ్ తెలిపిన వివరాల మేరకు... దండు వెంకటపతిరాజు (64) 2018లో హెడ్ కానిస్టేబుల్‌గా పదవీ విరమణ చేశారు. కుమారుడు మనోజ్‌కుమార్ లండన్‌లో చదువుకుంటున్నాడు. వీరి కుటుంబం తాళ్లవలస రాజేష్ రెసిడెన్సీలో నివాసముంటోంది. గ్రామ దేవత పండగ నేపథ్యంలో పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు మంగళవారం ఉదయం సంగివలస మూడు గుళ్ల అమ్మవార్ల సెంటర్‌కు వెంకటపతిరాజు స్కూటీపై వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆయన ద్విచక్రవాహనాన్ని వలందపేట వద్ద ఎదురుగా విశాఖ నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొని కొంతదూరం ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయమైన వెంకటపతిరాజు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కారు డ్రైవర్ అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన వర్రి నందకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుమార్తె రుద్రరాజు సాయిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరీశ్ తెలిపారు

26న గీతం ఎంట్రన్స్ టెస్ట్

సాగర్‌నగర్, మే 21: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి ఈనెల 26న గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్టు స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి తెలిపారు. బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్స్) కోర్సులు, మూడేళ్ల బీసీఏ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సులుంటాయని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో ప్రవేశానికి ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోదలచిన వారు గీతం వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చునన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఒడిశా దాసుడు


ఆలయంలో పరివారంతో దాసుడు

సింహాచలం, మే 21: వరాహలక్ష్మీనృసింహస్వామిని ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయకోదాసుడు మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు, శిష్యపరివారంతో దర్శించుకున్నారు. ఆలయ కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండప ప్రదక్షిణలు చేసిన తరువాత అంతరాలయంలో పూజలు జరిపించారు. స్వామికి ప్రీతికరమైన సుగంధ పరిమళభరిత సంపెంగలు, మల్లెలు, విరజాజులతోపాటు, మామిడి అరటి పండ్లను సమర్పించారు. అనంతరం గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

సింహాచలంలో నేడు నృసింహ జయంతి

సింహాచలం, మే 21: నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని ఈనెల 22న నృసింహవనంలోని స్వామివారి విగ్రహం వద్ద సాయంత్రం నాలుగు గంటలకు 'నృసింహ జయంతి'ని నిర్వహించనున్నారు. ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న మైదానంలో ఉదయం 8 గంటల నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని 22న సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి సర్వదర్శనాలు లభిస్తాయని ఈవో తెలిపారు. స్వాతి హోమంలో పాల్గొనదలచిన భక్తులు పీఆర్వో కార్యాలయంలో ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌లో టికెట్లను పొందవచ్చునన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	138.00
లైవ్ ధర	158.00
విత్ స్కిన్	286.00
స్కిన్ లెస్	296.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఏటికొప్పాక ఎవరి వైపు మొగ్గు చూపేనో?

» గ్రామంలో పెరిగిన పోలింగ్ శాతం
» ఇక్కడ ఏ పార్టీకి మెజారిటీ వస్తే ఆ పార్టీ అభ్యర్థిని విజయం వరించడం ఆనవాయితీ



ఎలమంచిలి, మే 21: లక్కబొమ్మలు తయారులో జాతీయ స్థాయిలో పేరుగాంచిన ఏటికొప్పాక సెంటిమెంట్ ఏ పార్టీని వరిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా ఎలమంచిలి అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థి ఎవరైనా తొలిసారిగా ఏటికొప్పాక గ్రామదేవత బండిమాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీ. వైసీపీ అభ్యర్థి యూవీ రమణమూర్తి, జనసేన పార్టీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్న తర్వాతే ప్రచారం ప్రారంభించారు. గతంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు ఈ ఆనవాయితీని పాటించారు. ఏటికొప్పాక గ్రామానికి మరో సెంటిమెంట్ కూడా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఏటికొప్పాకలో ఏ పార్టీకి మెజారిటీ వస్తే ఆ పార్టీ నేత ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ఆనవాయితీగా వస్తుంది. ప్రజారాజ్యం సమయంలో మాత్రమే ఈ సెంటిమెంట్ వర్కవుట్ కాలేదని, మిగిలిన ప్రతి ఎన్నికల్లోనూ కొనసాగిందని స్థానికులు అంటున్నారు. మండలంలోనే ఏకైక మేజర్ పంచాయతీ అయిన ఏటికొప్పాకలో ఈసారి అధిక శాతం పోలింగ్ నమోదైంది. గ్రామంలో 5,148 మంది ఓటర్లలో 4,304 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. గ్రామంలోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకూ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామంలో 83 శాతం పోలింగ్ అయింది. ఇంతకు ముందెన్నడూ ఇంత పోలింగ్ శాతం నమోదు కాలేదు. 2019 ఎన్నికల్లో 76 శాతం నమోదైంది. అధికంగా యువకులు, మహిళలు ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. ఈసారి జరిగిన ఎన్నికల్లో సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందో.. లేదోనని స్థానికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

శిథిలావస్థలో మైనర్ శారదా నదిపై వంతెన

» మర్రిపాలెం - రాజారాయుడుపాలెంల మధ్య ఇరువైపులా లేని రక్షణ గోడలు
» భయాందోళనలో రెండు గ్రామాల ప్రజలు


మైనర్ శారదాపై ఉన్న వంతెనకు ఇరువైపులా లేని రక్షణ గోడలు

రాంబిల్లి, మే 21: మండలంలోని మర్రిపాలెం-రాజారాయుడుపాలెం వెళ్లే గ్రామాల మధ్య మైనర్ శారదా నదిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. అంతేకాకుండా వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. దీంతో నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు.

ఈ రెండు గ్రామాల మధ్య మైనర్ శారదా నదిపై వంతెనను 1999వ సంవత్సరంలో నిర్మించారు. అయితే ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో రాకపోకలు సాగించే సమయంలో ప్రజలు, వాహన చోదకులు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నదిలో నీటి ఉధృతి అధికంగా ఉన్న సమయంలో మరింతగా భయపడుతున్నారు. ఈ వంతెనకు మరమ్మతులు జరిపి ఇరు వైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని మర్రిపాలెం, రాజారాయుడుపాలెం ప్రజలు కోరుతున్నారు.

రెండు ప్రాంతాల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్

» రికార్డులు లేని 10 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలు సీజ్


కాలనీవాసులతో మాట్లాడుతున్న అనకాపల్లి పట్టణ ఎస్‌హెచ్ఓ శంకరరావు


నాగులాపల్లిలో సీజ్ చేసిన బైక్‌లతో పోలీస్ సిబ్బంది

కొత్తూరు, మే 21: అనకాపల్లి పట్టణం శివార్లలో ఉన్న సుబ్రహ్మణ్యం కాలనీ, డీబీ కాలనీల్లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ మంగళవారం జరిగింది. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జరిగిన ఈ ఆపరేషన్‌లో ఎటువంటి రికార్డులు లేని 10 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు సీజ్ చేసినట్టు పట్టణ ఎస్‌హెచ్ఓ జి. శంకరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులతో మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుమానాస్పద ప్రాంతాల్లో ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఆయన హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో పట్టణ ఎస్ఐలు సత్యనారాయణ, అలీ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

నాగులాపల్లిలో..

మునగపాక (తుమ్మపాల), మే 21: మునగపాక మండలం నాగులాపల్లిలో మంగళవారం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఎలమంచిలి సీఐ గఫూర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున గ్రామాల్లో మొహరించి జల్లెడ పట్టారు. ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి రికార్డులు లేని 41 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ గఫూర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనుండడంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక ఎస్ఐ ప్రసాదరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో కేన్సర్ స్క్రీనింగ్‌కు కార్యాచరణ

ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్. వేంకటేశ్వర్


వైద్య నిపుణులతో మాట్లాడుతున్న వేంకటేశ్వర్

అగనంపూడి, మే 21: గ్రామ స్థాయిలో కేన్సర్ స్క్రీనింగ్‌కు కార్యాచరణ ప్రణాళికను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేస్తుందని, ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇక్కడి హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ప్రివెంటివ్ అంకాలజీ, కమ్యూనిటీ హెల్త్ మెడిసిన్, గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటిస్ట్రీ, పేథాలజీ, సర్జరీ విభాగాల్లోని వైద్య నిపుణులతో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో శిక్షణ ఇచ్చేందుకు మంచి మానవ వనరులు ఉన్నాయన్నారు. శిక్షణ పొందిన వైద్య నిపుణులు జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలకు శిక్షణ అందించాలని సూచించారు. స్క్రీనింగ్‌లు నిర్వహించి సంబంధిత మెడికల్ ఆఫీసర్లకు రిఫర్ చేయాలన్నారు. గ్రామ స్థాయిలో కేన్సర్ స్క్రీనింగ్ విజయవంతం చేసేందుకు వైద్య నిపుణులు కృషి చేయడంతో పాటు అందుకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని డాక్టర్ వెంకటేశ్వర్ కోరారు. అనంతరం ఆయన వైద్య నిపుణులతో కలిసి ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర నోడల్ అధికారులు శ్యామల, రాజ్‌కిరణ్, ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్‌మహంతి శెట్టి, డాక్టర్ రవితేజ, తదితరులు ఉన్నారు.

ఓటర్లకు లంచం ఇచ్చే సంస్కృతిని అరికట్టాలి

» ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు

విశాఖపట్నం, మే 21: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను చూస్తే ప్రజాస్వామ్యయుత రాజకీయాలు కాకుండా.. ధనస్వామ్యమే రాజ్యమేలినట్టు కనిపించిందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముర్రుముత్యాలనాయుడు అన్నారు. పలు పార్టీలకు చెందిన నేతలు పట్టపగలే డబ్బుపంచుతూ ఓట్లు అడగడం దారుణమన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు లంచాన్ని సులభతరం చేసే అన్ని అక్రమ లావాదేవీలను అరికట్టేలా సంస్కరణలు తేవాలన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రపతి, అన్ని రాజకీయ పార్టీల అధిష్ఠానాలకు లేఖలు రాసినట్టు చెప్పారు. ఓటు అన్నది రహస్యంగా ఉండాలని, అయితే ఇటీవల ఎన్నికల్లో ఒక్కో ఓటు కనీసం రూ.1500 పలకడం శోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఏపీ పోలింగ్ దారుణాలు, ధన ప్రవాహంపై ఆంగ్ల పత్రికల్లో సైతం ప్రచురితం కావడం పాలకుల వైఖరి ఏమిటో స్పష్టమవుతోందన్నారు. ఎన్నికల్లో దాదాపుగా ఒక్కో నియోజకవర్గంలో అభ్యర్థి, ప్రత్యర్థి పార్టీలు రూ.50 కోట్లు ఖర్చు చేశారని, ఈ మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా రూ. 8250 కోట్లు ఉంటుందని, ఈ సొమ్మంతా ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్, పోలీస్ శాఖ కళ్లుగప్పి నేతలు తమ నేతృత్వంలో డబ్బును డోర్ డెలివరీ చేశారన్నారు.

నగదు విషయమై మహిళతో ఆటో డ్రైవర్ గొడవ

» ఆటో డ్రైవర్‌ను మేడ పైనుంచి కిందకు తోసేసిన మహిళ
» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


మైలపిల్లి గురువులు (ఫైల్‌ఫొటో)

పరవాడ, మే 21 : నగదు విషయమై ఆటో డ్రైవర్ మహిళతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఆమె కోపంతో ఆటో డ్రైవర్‌ను మేడ పైనుంచి కిందకు నెట్టివేయడంతో అతడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలపిల్లి గురువులు (35) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువులుకు దిబ్బపాలెం గ్రామానికి చెందిన సురపతి రాజీ కూలీ పనులకు వెళ్తూ తరచూ గురువులు ఆటో ఎక్కేది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఇదిలా ఉంటే ఆదివారం రాత్రి పది గంటల సమయంలో గురువులు మద్యం సేవించి రాజీకి ఫోన్ చేశాడు. ఆమె కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ ఓ పాస్టర్ ఇంటిపైన ఉంటుంది. మద్యం మత్తులో ఉన్న గురువులు ఆమె వద్దకు వెళ్లి నగదు విషయమై మాట్లాడాడు. ఈ క్రమంలో ఇరువురు మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె కోపంతో గురువులును నెట్టి వేయడంతో కిందకు పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు గాయాలపాలైన గురువులును కుటుంబసభ్యులు విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఇదిలా ఉంటే పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగిన ఇంటి పరిసరాలను పరిశీలించారు. దాడికి పాల్పడిన రాజీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గురువులు మృతదేహానికి విశాఖ కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడు భార్య యల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఈ-సెట్‌లో జిల్లా విద్యార్థి సత్తా

» మెటలార్జికల్ ఇంజినీరింగ్ విభాగంలో మొదటి ర్యాంకు


అలవెల్లి ఖ్యాతీశ్వర్

పరవాడ, మే 21: మండలంలోని వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం గ్రామానికి చెందిన అలవెల్లి ఖ్యాతీశ్వర్ తెలంగాణ ఇంజినీరింగ్ ప్రవేశపరీక్ష (టీఎస్ ఈ-సెట్) మెటలార్జికల్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించాడు. విశాఖ దరి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023 డిసెంబరులో డిప్లమో పూర్తి చేసి 88 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. గతేడాది డిప్లమో చివరి ఏడాదిలో ఏపీ ఈ-సెట్ రాస్తే తనకు ఎనిమిదవ ర్యాంకు వచ్చిందని ఖ్యాతీశ్వర్ తెలియజేశారు. ఈ ఏడాది కూడా ఈ-సెట్ రాశానని, ఇంకా ఫలితాలు రావాల్సి ఉందన్నారు. ఖ్యాతీశ్వర్ తండ్రి మిన్నారావు సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన జీవనరేఖ ఆస్పత్రిలోని కాంట్రాక్టు పద్ధతిలో కాంపౌండరుగా పనిచేస్తున్నారు. తల్లి హైమావతి గృహిణి. వీరి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం జోగిపాలెం గ్రామం. భవిష్యత్తులో ప్రభుత్వ ఇంజినీర్ కావడమే తన లక్ష్యమన్నారు.

జూన్ ఒకటి నుంచి సార్వత్రిక టెన్త్ పరీక్షలు

అనకాపల్లి రూరల్, మే 21 : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారిచే నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు జూన్ ఒకటి నుంచి ఎనిమిదవ తేదీ వరకు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులంతా పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు.

24 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

అనకాపల్లి కలెక్టరేట్, మే 21 : జిల్లాలో ఈనెల 24వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పేర్కొన్నారు. మంగళవారం వెబెక్స్ ద్వారా ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో 14,804 మంది విద్యార్థులు ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరి కోసం 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కౌంటింగ్ నాడు పటిష్ట చర్యలు తీసుకోవాలి

» అధికారులకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశం

అనకాపల్లి రూరల్, మే 21 : వచ్చే నెల నాల్గో తేదీన జరగనున్న కౌంటింగ్ నాడు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ఫలితాల రోజు నుంచి 15 రోజుల వరకు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సంఘటనలు జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని గ్రామాల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఏపీఆర్‌డీసీ పరీక్షల్లో దేవిప్రసాద్‌కు 29 ర్యాంక్


దేవి శ్రీప్రసాద్

కోటవురట్ల, మే 21: ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహించిన ఏపీఆర్‌డీసీ పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న కోటవురట్ల గ్రామానికి చెందిన ఆర్. హర్షవర్ధన్ దేవిశ్రీప్రసాద్ (సీఈసీ) రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంక్ సాధించి నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో డీకామ్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏఆర్‌టీ సుజాత మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏ రంగాల్లోనైనా లక్ష్యాన్ని సాధించవచ్చునని హర్షవర్ధన్ దేవి శ్రీప్రసాద్ నిరూపించడన్నారు. ఈసందర్భంగా దేవిశ్రీప్రసాద్‌ను అధ్యాపకులు అభినందించారు.




భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం... (ఇన్‌సెట్‌లో) అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

▸▸ అమ్మవారికి భారీగా మొక్కులు తీర్చుకున్న భక్తులు

పాడేరు రూరల్, మే 21: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, గిరిజనుల ఇలవేల్పు మోదకొండమ్మ ఆలయం మంగళవారం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ప్రకటన ప్రకారం ఉత్సవం ఈ నెల 19న ప్రారంభమై 21వ తేదీ మంగళవారంతో ముగియాల్సి ఉంది. కాని ఎన్నికల కోడ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉండడం, బాలెట్ బాక్స్‌లు(ఈవీఎంలు) అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోనే ఉండడంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించలేమన్న ఉద్దేశంతో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు అధికారులతో సమావేశమైన తరువాత ఉత్సవాల తేదీలను తాత్కాలికంగా వాయిదా వేస్తూ ఉత్సవాలను వచ్చే నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మూడు రోజులు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి ప్రకటించారు. ఉత్సవాల తేదీలను మార్చినా వివిధ రాష్ర్టాల్లో ఉద్యోగాలు చేసేవారు, విద్యనభ్యసించేవారు పండగకు సెలవులు పెట్టుకొని వచ్చారు. అలాగే వచ్చే 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు మరోసారి వచ్చేందుకు అవకాసం లేనివారు ముందుగా పండగ తేదీలను ప్రకటించిన మాదిరిగానే ఆదివారం నుంచి మంగళవారం వరకు మొక్కులు తీర్చుకొనేందుకు ఆలయానికి వందల సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకోవడం, మొక్కులు తీర్చుకోవడం, వేటలను బలివ్వడంతో ఆలయ ప్రాంగణంలో మంగళవారం పండగ వాతావరణం కనిపించింది. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన కార్యదర్శి, కొట్టగుల్లి సింహాచలంనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుల్లి రామారావు ఆధ్వర్యంలో ఆలయ, ఉత్సవ, ప్రసాద కమిటీ సభ్యులు, భక్త బృంద సభ్యులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

పెదవలసలో కు.ని శస్త్ర చికిత్సలు

▸▸ డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు



కు.ని శస్త్ర చికిత్స చేస్తున్న సీనియర్ వైద్యాధికారి కృష్ణారావు

గూడెంకొత్తవీధి, మే 21: మండలంలోని పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు పాడేరు జిల్లా ఆస్పత్రి సీనియర్ వైద్యాధికారి కృష్ణారావు తెలిపారు. మంగళవారం పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కుటుంబ నియంత్రణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ పరిధిలోని 60 మంది పురుషులకు వైద్యులు డీకే హిమబిందు, లక్ష్మీకాంత్, శివప్రసాద్‌తో కలిసి శస్త్ర చికిత్సలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఎంహెచ్‌వో జమాల్ బాషా ఆదేశాలతో ప్రత్యేక కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇద్దరికి మించి సంతానం కలిగిన కుటుంబంలో ఒకరు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకోవాలని ఆయన సూచించారు. అధిక సంతానం వల్ల మహిళలు, చిన్నారులు రక్తహీనతకు గురవుతారని, అనారోగ్య సమస్యలు కలిగే ప్రమాదం ఉందని చెప్పారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకున్న పురుషులకు రూ.1100 ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు కోమలి, పృథ్వీషా తదితరులు పాల్గొన్నారు.

మ్యూటేషన్లు వేగవంతం చేయండి: తహసీల్దార్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, మే 21: మ్యూటేషన్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ టి.రామకృష్ణ సూచించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో మ్యూటేషన్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వ పట్టా మార్పిడి (మ్యూటేషన్)లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా వీఆర్వో, గ్రామ సర్వేయర్, గ్రామ సహాయకులు సంయుక్తంగా మ్యూటేషన్ దరఖాస్తులను పరిశీలించాలని చెప్పారు. సరిహద్దులు, భూమి సర్వే చేపట్టి నివేదిక రూపొందించాలన్నారు. కొలతల సమయంలో సరిహద్దులను కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలాగే సర్వే సమయంలో సరిహద్దు వ్యక్తులకు సమాచారం ఇవ్వాలన్నారు. మ్యూటేషన్ పట్టాల్లో కచ్చితంగా ఎల్‌పీ నంబరు, సర్వే పటం ఉండాలన్నారు. ఈ విధానం వల్ల భవిష్యత్‌లో భూ వివాదాలను నియంత్రించవచ్చునని ఆయన చెప్పారు.



జలపాతం అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

తారాబు జలపాతంలో పర్యాటకుల సందడి

ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల సరిహద్దు ప్రాంతమైన గిన్నెలకోట పంచాయతీ గుంజివాడ సమీపంలో గల తారాబు జలపాతం వద్ద మంగళవారం పర్యాటకులు సందడి చేశారు. ఎత్తైన గిరులపై నుంచి పాలధారలా ప్రవహించే ఈ జలపాతాన్ని చూసేందుకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో జలపాతం పరిసర ప్రాంతమంతా పర్యాటకులతో కిటకిటలాడుతూ సందడి వాతావరణం కనిపించింది.

-ముంచంగిపుట్టు

చీపురుగొందిలో దాహం కేకలు

మూలకు చేరిన తాగునీటి పథకం.. కలుషిత నీరే ఆధారం

వ్యాధులు బారిన గిరిజనం.. పట్టని అధికార యంత్రాంగం

ముంచంగిపుట్టు, మే 21: మండలంలో ఎప్పటిలాగే గిరిజనులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. వేసవి దృష్ట్యా నీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం, మరమ్మత్తులకు గురైన తాగునీటి పథకాలను పట్టించుకోకపోవడం వెరసి గిరిజన గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. మండలంలోని మారుమూల కుమడ పంచాయతీ చీపురుగొంది గ్రామంలో సుమారు 48 కుటుంబాల గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వారి దాహం తీర్చేందుకు ఒక నీటి పథకాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఈ పథకం మూలకు చేరి నెలలు కాస్తున్నది. దాని బాగోగులపై సంబంధిత అధికారులు కనీసం దృష్టిసారించడంలేదు. ఫలితంగా తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు జి.తిల్లి, కె.మల్లేష్, జి.సన్యాసిరావు, కె.జిన్నా, జి.వెంకట్ రావు, జి.సుబ్బారావు, ఎం.ముకుంద్, కె.గణేష్, జి.మంగ్లన్న, కె.బందు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు ఎన్ని సార్లు వినతులు అందించినా పట్టించుకోడం లేదని వారు వాపోయారు.

కలుషిత ఊటగెడ్డ నీరే ఆధారం

గ్రామంలో ఉన్న నీటి పథకం మూలకు చేరవడంతో కలుషిత ఊటగెడ్డ నీటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత గెడ్డ నీటిని తాగడం వల్ల తరచూ పలు రకాల వ్యాధులు బారిన పడుతున్నామని, అయినప్పటికీ గత్యంతరం లేక ఈ నీటినే తాగాల్సి వస్తున్నదని వాపోయారు.

అలాగే గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న ఊటగెడ్డకు వెళ్లి నీటిని సేకరించి తీసుకువస్తున్నామని చెప్పారు. సుదూర ప్రాంతంలో ఉన్న గెడ్డ నీటిని సేకరించి తీసుకురావడం తలకు మించిన భారమవుతున్నదని మహిళలు వాపోయారు. ప్రస్తుతం ఎండలు విజృంభిస్తుండడంతో ఊటగెడ్డలు కూడా అడుగంటిపోతున్నాయని, కలుషిత నీరు సైతం దొరకడం గగనమైపోతున్నదని వారు భయాందోళన వ్యక్తం చేశారు. అన్ని అవసరాలకు సరిపడా నీటిని కావిడి సహాయంతో కూడా మోసుకువచ్చే సందర్భాలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు ముక్త కంఠంతో కోరుతున్నారు.



ఊట గెడ్డ నీటిని సేకరిస్తున్న మహిళ...



అడుగంటిపోయిన కలుషిత ఊట గెడ్డను చూపిస్తున్న స్థానిక ప్రజలు

లగిశపల్లిలో మెగా పశు వైద్య శిబిరం

2005 పశువులు, 263 మేకలు, గొర్రెలకు వ్యాధి నివారణ టీకాలు

పాడేరు రూరల్, మే 21: మండలంలోని లగిశపల్లి గ్రామంలో మంగళవారం మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 2005 పాడి, దుక్కి పశువులకు, 263 మేకలు, గొర్రెలకు జబ్బ వాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. లగిశపల్లిలో పశువులు తీవ్ర రోగాల బారిన పడి మృతి చెందుతున్నట్టు దినపత్రికల్లో వచ్చిన కథనాలకు ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చందక నరసింహులు తెలిపారు. ఈ శిబిరంలో పాడి పశువులకు రక్త నమూనాలు, పేడనాలు సేకరించి చింతపల్లిలోని కేడల్ వారికి పంపించామన్నారు. రైతులు వారి పశువులకు సకాలంలో నట్టల నివారణ చేయించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పాడి రైతులకు అవసరమైన మందులను ఉచితంగా సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీవో కె.సాయినవీన్, లగిశపల్లి పంచాయతీ సర్పంచ్ లకే పార్వతమ్మ, వంట్లమామిడి పశు వైద్యాధికారి రాజు కిశోర్, డోకులూరు లైవ్ స్టక్ అసిస్టెంట్ సురేష్, ల్యాబ్ అసిస్టెంట్ సతీష్, పశు సంవర్ధక శాఖ సహాయకులు పలాసి శ్రీనుబాబు, కోటిబాబు, చంద్రమోహన్, ఉమా మహేశ్వరరావు, అమృత సంస్థ ప్రతినిధులు రోజా, కనక పాల్గొన్నారు.



లగిశపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య శిబ్బంది

జిల్లాలో తగ్గుతున్న భూగర్భ జల సాంద్రత

▸▸ భూగర్భ జల శాఖ ఏజీపీ రమేష్

కొయ్యూరు, మే 21: జిల్లాలో నీటి నిల్వలకు అవకాశం లేకపోవడంతో భూగర్భ జల సాంద్రత తగ్గుతున్నదని జిల్లా భూగర్భ జల శాఖ ఏజీపీ రమేష్ తెలిపారు. మండలంలోని రాజేంద్రపాలెం, నడింపాలెం, రామరాజుపాలెం, మర్రిపాలెం, బాలారం తదితర గ్రామాల్లో మంగళవారం భూగర్భ జల సాంద్రత స్థాయిని ఏజీపీ పరిశీలించి నివేదికలను పొందుపరుచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 53 భూగర్భ జల లెవెల్స్ కనుగొనే రికార్డర్లు ఉన్నాయన్నారు. వీటిలో నాలుగు డిజిటల్ వాటర్ లెవెల్ రికార్డర్లు కాగా, మిగిలినవన్నీ మాన్యువల్‌గా కొలిచే విధానంతో ఉన్నాయని చెప్పారు. జిల్లాలో వాటర్ క్యాచ్‌మెంట్ తక్కువ కావడంతో భూగర్భ జలాల లెవెల్స్ తక్కువగా నమోదవుతున్నాయన్నారు. ఇప్పటివరకు జిల్లాలో రంపచోడవరం డివిజన్‌లోని 26 ప్రాంతాలలో ఏర్పాటు చేసిన భూగర్భ జల సాంద్రత రికార్డర్లను పరిశీలించామన్నారు. ఇందులో అత్యధికంగా రంపచోడవరం సమీప కోట గ్రామంలో 16.72 మీటర్ల మేర భూగర్భ జల సాంద్రత ఉన్నట్టు నమోదైందని ఆయన తెలిపారు. అత్యల్పంగా అడ్డతీగల మండలం వీరభద్రపురంలో 2.52 మీటర్లు నమోదైందన్నారు. కొయ్యూరు మండలలోని మర్రిపాలెం గ్రామంలో 17 మీటర్లు దాటి జల సాంద్రత ఉందన్నారు. మిగిలిన నాలుగు ప్రాంతాల్లో పది నుంచి 12.40 మీటర్లు మేర జల సాంద్రత నమోదైనట్టు ఏజీపీ తెలిపారు.



రాజేంద్రపాలెంలో భూగర్భ జల సాంద్రతను కొలుస్తున్న ఏజీపీ రమేష్

పాఠశాలలు తెరచిన వెంటనే విద్యా కానుక కిట్లు



సీబీఎస్‌ఈ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీవో

పాడేరు రూరల్ మే 21: కొత్త విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రోగ్రామింగ్ అధికారి (ఎస్పీవో) రమణ సూచించారు. జిల్లా కేంద్రం పాడేరులోని గుడివాడ పాఠశాల ప్రాంగణంలో విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను మంగళవారం సందర్శించారు. పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లను పరిశీలించారు. విద్యార్థులకు అందించాల్సిన స్టాక్ విషయంలో ఇబ్బందులు ఉంటే వెంటనే డిపార్ట్‌మెంట్‌కు తెలియజేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం పాడేరులోని సీబీఎస్‌ఈ సిలబస్‌పై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. శిక్షణ తరగతులు జరుగుతున్న విధానంపై కోర్సు డైరెక్టర్ కరణం సూర్యకుమారిని అడిగి తెలుసున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ జిల్లా సమగ్ర శిక్షాఅధికారులు సీఎంవో జ్ఞానప్రకాష్, ఏఎంవో భాస్కరరావు, ఎంఈవో-1 ఎస్.రామచందరరావు, ఎంఈవో-2 సిహెచ్.సరస్వతీదేవి, తులసి, మండల కో-ఆర్డినేటర్ వి.జయరాజు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

పాడేరు రూరల్, మే 21: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గురుకుల కళాశాలల కన్వీనర్ ప్రిన్సిపాల్ యండమూరి పారయ్య ఆధ్వర్యంలో స్థానిక గురుకుల కళాశాలలో ఈ ప్రక్రియ చేపట్టారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని అరకు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు మండలాల్లోని బాలురు గురుకుల కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎ అండ్ టి (అకౌంట్స్ అండ్ టాక్సేస్) గ్రూపుల్లో చేరేందుకు 800 సీట్లకుగాను 1,568 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన బాలుర కౌన్సెలింగ్ సాయంత్రం 7 గంటల వరకు చేపట్టి 800 సీట్లు భర్తీ చేశామన్నారు. ఈ కౌన్సెంగ్‌లో బాలికల కళాశాల ప్రిన్సిపాల్ కె.ధనలక్ష్మి, అరకు ప్రిన్సిపాల్ సిహెచ్.లక్ష్మణుడు, చింతపల్లి ప్రిన్సిపాల్ వి.కస్తూరిబాయి, కొయ్యూరు ప్రిన్సిపాల్ సూరిబాబు, పెదబయలు ప్రిన్సిపాల్ ఆర్.ఈశ్వరరావుతో పాటు వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌ను ప్రారంభించిన టీడబ్ల్యూ డీడీ కొండలరావు

☛ సంక్షిప్తంగా..

గురుకులాల్లో ప్రతీ గ్రూపునకు 80 సీట్లు కేటాయించాలి

పాడేరు రూరల్, మే 21: జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాలల్లో ప్రతీ గ్రూపునకు 80 సీట్లు కేటాయించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఇంతవరకు 40 సీట్లు మాత్రమే ఉండేవని, వాటిని ఈ విద్యా సంవత్సరంలో 60 నుంచి 80కి పెంచాలని కోరారు. గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్థిక స్థోమత లేకపోవడం వల్ల గురుకుల కళాశాలల్లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఐటీడీఏ అధికారులు మాత్రం గ్రూపునకు 40 సీట్లను మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఐటీడీఏ పీవో, గురుకులం ప్రిన్సిపాల్ సెక్రటరీ తక్షణమే స్పందించి సీట్లు పెంచడంతో పాటు ప్రతీ మండలంలో గురుకుల కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కృష్ణ, రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్‌లో వసూళ్లపై విచారణ చేపట్టాలి

పాడేరు రూరల్, మే 21: కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్‌లో అక్రమ వసూళ్లు జరిగాయన్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో సమగ్ర విచారణ చేపట్టాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గిరిజన సంఘం అనేక పోరాటాలు చేసిందన్నారు. అవినీతి అధికారుల కారణంగా అనేక మంది కాంట్రాక్టు ఉద్యోగులు ప్రస్తుతం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహించిన కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులేషన్‌లో అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని సీఆర్టీలు ఆరోపిస్తున్నారన్నారు. అర్హత లేకపోయినప్పటికీ కొంత మంది నుంచి అక్రమంగా నగదు వసూలు చేసి రెగ్యులైజేషన్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటిపై అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

గ్రంథాలయంలో ఆటల పోటీలు



డుంబ్రిగుడ లైబ్రరీలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

డుంబ్రిగుడ, మే 21: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు, చిన్నారులకు ఆటలు, యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 20 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖ అధికారి సునీత మాట్లాడుతూ విద్యార్థులు చదువు, యోగా, వ్యాయమంతో పాటు ఆటలు కూడా ఆడుతుండాలని చెప్పారు. దీనివల్ల శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

గూడెంకొత్తవీధి, మే 21: మండలంలోని సంకాడ పంచాయతీ గోవాడ గ్రామంలో సెల్ టవర్ వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ ఆవు మృతి చెందింది. గోవాడ గ్రామంలో రెండు నెలల కిందట ఓ సెల్ టవర్‌ను నిర్మించారు. టవర్‌కు ఏపీఈపీడీసీఎల్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అయితే టవర్ చుట్టూ ఇనుప కంచె నిర్మించలేదు. టవర్‌కు విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ స్తంభానికి విద్యుత్ సరఫరా జరుగుతున్నది. మంగళవారం మేతకు వెళ్లిన ముర్ల నూకరాజుకు చెందిన ఆవు టవర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. టవర్ యజమానులు, ఈపీడీసీఎల్ అధికారులు పరిహారం చెల్లించాలని ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

వేరుశనగ సాగు విస్తరణకు కార్యాచరణ

... 5వ పేజీ తరువాయి

దిగుబడి కూడా రావడంలేదు. ఈ నూతన విత్తనాలను రైతులు సాగుచేసుకోవడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడి పొందవచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు.

మార్కెట్‌లో అధిక డిమాండ్

నూతన రకాలైన కె-7 బోల్డ్ రకాలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ లభిస్తోంది. గింజ పరిమాణం సాధార గింజలకంటే రెట్టింపు వుంటోంది. ఈ గింజల్లో దాదాపు 75 శాతానికిపైగా నూనె కలిగి వుంటోంది. ఈ నూతన రకాల్లో పోషక విలువలు కూడా సాధాన గింజలకంటే రెట్టింపు వున్నాయి. చీడపీడలు ఆశించడం లేదు. ఒక మొక్క నుంచి కనీసం అర కిలోకుపైగా దిగుబడి వస్తోంది. కాయ పరిమాణం పెద్దగా వుండడంతో ఈ గింజలకు మార్కెట్‌లో కిలో రూ.200కి పైగా ధర లభిస్తుంది.

నూతన వంగడంపై పరిశోధన

పరిశోధన స్థానంలో వేరుశనగలో అత్యధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో 'కదిరి లేపాక్షి'పై శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ప్రయోగాత్మక సాగులో ఎకరాకు 18- 20 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్టు గుర్తించారు. ఈ రకం ప్రధానంగా తెగుళ్లు, చీడపీడలను తట్టుకుంటుంది. గింజల్లో 51 శాతం నూనె శాతం ఉంటుంది. ప్రయోగాత్మక సాగులో శాస్త్రవేత్తలు ఉత్తమ ఫలితాలు సాధించారు.

మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

కొయ్యూరు, మే 21: మండల వ్యాప్తంగా మూగ జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు పశు వైద్యాధికారి క్రాంతికుమార్ తెలిపారు. ప్రస్తుతం పశువులకు జబ్బవాపు, డెక్కవాపు, గాలికుంటు తదితర వ్యాధులతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్లకు వ్యాధులు సోకుతున్నాయన్నారు. వీటి నివారణ చర్యలతో పాటు భవిష్యత్తులో పశుగణం వ్యాధుల బారిన పడకుండా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ మేరకు సచివాలయాల పరిధిలోని పశు సంవర్ధక శాఖ సహాయకులతో పాటు సిబ్బంది వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



రాజేంద్రపాలెంలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది